# తల!



(రచయిత)

రచన : శ్రీ సానుబాల రాజగోపాల్

వీధి తలుపులు అదే పనిగా కొడుతున్నారు. జానకి వంట గదిలో వంట చేసుకొంటుంది. ఆ శబ్దానికి విసుగు పుట్టికొచ్చింది. చచ్చినోళ్ళు తలుపు కొట్టడమేం? కాలింగ్ బెల్ నొక్క వచ్చును గదా! అని విసుక్కొంది. కాని వెంటనే జ్ఞాపకమొచ్చింది కరెంట్ లేదన్న సంగతి. అనవసరంగా తిడుతున్నాను. పాపం ఎవరో? పాడు కరెంట్... ఎప్పుడూ కరెంటుకోతే! చలికాలం వర్షాకాలంలో కూడానా! ఈ దరిద్రం వదలడంలేదు. అన్నట్లు మనది కరువు రాష్ట్రం కదా!

మళ్ళీ తలుపులు బాదిన చప్పుడు. ఆ...వస్తున్నా... వంటపని వదిలేసి, చేతులు కడుక్కొని తలుపులు తీయడానికి వీధి వసారాలోకి వచ్చింది. గొళ్ళెం తీయబోయి ఆగిపోయింది భర్త చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. అవేమిటంటే—తను ఇంట్లో లేప్పుడు ఎవరైనా వచ్చి వీధి తలుపులు కొట్టవచ్చు! వెంటనే తలుపులు తీసివేయకూడదు! ఇంటి లోపలనుండే ఆ వచ్చినవారిని ఎవరని అడగాలి! అలాగున ప్రశ్నిస్తూ ప్రక్క కిటికీలోనుండో తలుపుసందులోనుండో చూడాలి వచ్చినది ఎవరోనని! ఒక్కొక్కప్పుడు ఇంట్లోవారి గొంతులాగునే గొంతుకపెట్టి పిలవవచ్చును. అది భర్త హితబోధ!

మళ్ళీ తలుపులు బాదిన చప్పుడు! అబ్బబ్బ ఎవరు? మాట్లాడరేం? కిటికీలోనుండి చూసింది. మనిషి సగమే కనిపిస్తున్నాడు. పూర్తిగా కనిపించడంలేదు.

ఎవరు?

నేనక్క!

అది తమ్ముడి గొంతుకే! లేకపోతే భర్త చెప్పినట్లు ఎవరైనా ధ్వని అనుకరణ చేస్తున్నారేమో!

అబ్బ! తలుపులు తియ్యవే, అని కిటికీకు ప్రక్కగా వచ్చి నిలబడ్డాడు.

తమ్ముడిని చూచి నవ్వుకొంటూ నువ్వేరా! ఎవరో అనుకొని హడలి చచ్చాననుకో! ఎవరు అని అడిగితే మాట్లాడవేం? అని తలుపులు తీసింది.

రమేష్ లోపలికి వచ్చాడు.

ఈ మధ్య నక్సలైట్స్, బందిపోట్లు, రాడికల్స్ తిరుగుతున్నారటరా!

అని బావ చెప్పారా?

ఆ!...

ఆయన చెప్తారులే! మొన్న బావగారు వైజాగ్ వచ్చి ఇంటి కొచ్చారు. నేను ఇంట్లోలేను. నేను ఫ్రెండ్స్‌ని కలియడానికని వరంగల్ వెళ్ళానని నాన్న బావగారితో చెప్పారు! అంతే ఆయనకి అనుమానం వచ్చేసింది.

అనుమానం ఏమిటిరా?

నేను నక్సలైట్స్‌తోగాని, రాడికల్స్‌తోగాని కలిసిపోయానేమోనని!

ఊరుకోరా మీ బావని నువ్వెప్పుడు అనుమానిస్తునే వుంటావు.

బావగారు నన్ను అనుమానించడానికి కారణం లేకపోలేదు.

కారణమా?

అవును. నేను అప్పుడప్పుడు ఇలా అంటుండేవాడిని! మనదేశంలో నిరుద్యోగ సమస్య తీరటంలేదు. కరువు, కాటకం, కడుపుమంట, వరకట్నపు చావులు, లాకప్ మరణాలు, అవినీతి, అక్రమం, లంచగొండితనం, ఉన్నవాళ్ళ ఆస్తులు పెరుగుతున్నాయి. మధ్య తరగతి మంటగలసిపోతుంది. రిజర్వేషన్‌ల పేరుతో అసమర్దులు పైకి వస్తున్నారు. ప్రతిభ, ధనిక రథ చక్రాల క్రింద నలిగిపోతుంది. ప్రతి నాయకులు దేశంలో. మనరాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తీర్చేస్తాం! దరిద్రాన్ని రూపుమాపుతాం, దరలు తగ్గించేస్తాం, సోషలిజం స్థాపిస్తాం! ఇలా ఎన్ని ఊకదంపుడు ఉపన్యాసాలు: వీళ్ళవలన లాభంలేదు. మళ్ళీ మనదేశంలో అల్లూరి, భగత్‌సింగ్‌లు పుట్టాలి! శ్రీశ్రీ లాంటి విప్లవ రచయితలు జన్మించాలి. ఆర్థిక విప్లవం రావాలని అనేవాడిని.

అంతే, బావగారి పోలీసు బుద్ధి ఎక్కడికి పోతుంది.

పోరా నువ్వెప్పుడు 'పోలీసు బుద్ధి, పోలీసు బుద్ధి' అంటుంటావు. ఆయన చాలా మంచివారురా!

నువ్వేన్నయినా చెప్పు పోలీసు వాళ్ళని నమ్మకూడదు. అక్కని ఇంకా ఆటపట్టించాలని అక్కా! నీకు తెలుసో తెలియదో కాని పోలీసువాళ్లు కట్టుకొన్న భార్యనే నమ్మరట!

నోర్ముయ్యరా! నీ కెప్పుడూ వేళాకోళమే!


*With Best Compliments From :*



సరేలే బావగారు లేరా?

క్యాంపు వెళ్ళారు. ఎల్లుండి వస్తారు.

భోజనాలు పూర్తిచేసి అక్కా తమ్ముళ్ళు కబుర్లు చెప్పుకొంటూ కాలం గడిపారు.

రమేష్ వచ్చి మూడవ రోజు! ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ వచ్చే రోజుకూడా అదే! జానకి భర్త రాకకోసం ఎదురు చూస్తూంది.

ఆ రోజు రమేష్ హడావుడిగా ఇంటిలోకి వచ్చాడు. అతడి కళ్ళు ఎర్రగా వున్నాయి. జానకి ప్రక్కకి తప్పుకొంది. అతడి చేతిలో ఏదోసంచి, ఆ సంచినిండా రక్తపు మరకలు. ఆమెకి భయం వేసింది. గదిలో అక్కడక్కడా రక్తపు మరకలు! ఒరేయ్ ఏమిటిరా? భయపడుతూనే అడిగింది.

తలకాయ, రమేష్ జవాబు.

ఆ...ఎవరిది? ఆమె ఆందోళన!

ఎవరిదోలే! నరికి తీసుకొచ్చాను.

అమ్మబాబోయ్ హత! ఆమె వణికిపోయింది.

దీన్ని బావకి కనబడకుండా దాచేయ్!

నేనా! అమ్మో...భయంతో ఆమె వణికిపోయింది. నోటిమాట రావటంలేదు.

వీధిలో స్కూటర్ ఆగిన చప్పుడు:

మీ బావలాగుంది.

రమేష్ ఇటు అటు చూచి, గదిలో మూల సంచిపెట్టి వెనక గదిలోకి వెళ్ళి దాక్కొన్నాడు.

రాజశేఖర్ లోపలికి వచ్చేశాడు 'జానకీ' అని పిలుస్తూ.

భయపడుతూనే జానకి ఎదురుగా వెళ్ళింది. బెదురుగా అతని ప్రక్క చూసింది. అతడికి అనుమానం వచ్చింది. తన గదిలోకి వెళ్ళి చూచాడు. బట్టల స్టాండుకి తన బావమరది బట్టలులాగున్నాయి. గుమ్మం దగ్గర షూస్, టేబిలు ప్రక్కన రమేష్ సూట్‌కేస్ అవన్నీ అతడి గుర్తే! అక్కడక్కడ రక్తపు మరకలు.

మీ తమ్ము డెక్కడ?

ఆమె మాట్లాడలేదు.

బపితావారి...
ప్రత్యేక తయారింపులు
• సీఫోర్. • చూన్‌త్రి
• రాప్‌టూ • సెలెక్ట్‌ఒన్
• దట్ సెలక్షన్.
Phone : 22909
BAPITA KNITTERS
Lakshmi Nagar, Tirupur-638 602

నిన్నే!

ఆ...అని అనగలిగింది. అంతే!

జానకీ నువ్వు చెప్పనక్కరలేదు. ఆ హంతకుడిని పట్టుకోగలను కోపంగా అన్నాడు.

లోపల గదులన్నీ చూసాడు. రమేష్‌వున్న గదికి బయట గొళ్ళెం పెట్టాడు. రక్తపు మరకలుగుండా కుడిచేతి ప్రక్కనున్న గదిలోకి వెళ్ళాడు. గది మూలనవున్న సంచి చూసాడు.

సంచి తీశాడు. సంచి బరువుగా వుంది.

జానకీ అని బిగ్గరగా అరిచాడు. ఆమె వచ్చి భయంగా చూసింది.

ఈ సంచి మీ తమ్ముడిదేనా?

ఆ...గజగజ వణికిపోతోంది.

సంచిలోనున్న తలని బయటికి లాగాడు.

ఆశ్చర్యం!

జానకి భయం పోయింది. విరగబడి నవ్వటం మొదలు పెట్టింది.

ఇదంతా గదిలో కిటికీద్వారా గమనిస్తున్న రమేష్ బావా! నీకు యిష్టమని మేక తలకాయ తెచ్చాను. తలకాయ మాంసం వండడంలో అక్క స్పెషలిస్ట్ తెలుసా!

★